ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5

శ్రీకాకుళం
జిల్లా వార్తలు
ఆదివారం 14 సెప్టెంబరు 2025

ఉచితం కళకళ...
నాన్‌స్టాప్ వెలవెల
- శ్రీకాకుళం కాంప్లెక్స్‌లో అత్యంత రద్దీగా ఉండే విశాఖ కౌంటర్లు ఖాళీ
- ప్రయాణికులు తగ్గిన వైనం



6లో



19న డీఎస్సీ నియామక పత్రాలు

- సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ చేతుల మీదుగా..
- వెలగపూడిలో సచివాలయం సమీపాన అభినందన సభ
- ఉత్తరాంధ్రలో 2,660 మంది అభ్యర్థుల కోసం 118 బస్సుల ఏర్పాటు
- కార్యక్రమం ముగిసిన తర్వాత అభ్యర్థులకు పది రోజులపాటు శిక్షణ

విశాఖపట్నం, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): మెగా డీఎస్సీలో ఉపాధ్యాయులుగా ఎంపికైన అభ్యర్థులకు ఈ నెల 19న అమరావతిలో నియామక పత్రాలు అందజేస్తారు. ఇందుకోసం వెలగపూడిలో సచివాలయం వెనుక అభినందన సభ ఏర్పాటుకు విద్యా శాఖ సన్నాహాలు చేస్తోంది. ఉత్తరాంధ్రలో 2,660 మందికి నియామక పత్రాలు అందజేస్తారు. ఉమ్మడి శ్రీకాకుళం, విజయనగరం, విశాఖ జిల్లాల్లో స్కూల్ అసిస్టెంట్లు, ఎస్జీటీ, గురుకులాలు/మోడల్ పాఠశాలల ప్రిన్సిపాళ్లు, టీజీటీ, పీజీటీ పోస్టులకు ఎంపికైన అభ్యర్థులకు తోడుగా కుటుంబ సభ్యుల్లో ఒకరిని అభినందన సభకు అనుమతిస్తారు. ఉత్తరాంధ్ర నుంచి అభ్యర్థులు, వారి కుటుంబ సభ్యులను తీసుకువెళ్లడానికి సుమారు 120 బస్సులు ఏర్పాటు చేస్తున్నారు. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం నుంచి ఈనెల 18న ఉదయం బస్సులు బయలుదేరతాయి. ఆరోజు రాత్రికి విజయవాడ సమీపంలో వారికి వసతి ఏర్పాటుచేస్తారు. 19న ఉదయం అభినందన సభలో జిల్లాల నుంచి ఎంపిక చేసిన కొద్దిమందికి సీఎం నారా చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేశ్, ఇతర ప్రముఖులు నియామక పత్రాలు అందజేస్తారు. మిగిలిన వారికి అదే ప్రాంగణంలో ఏర్పాటుచేసే కౌంటర్ల ద్వారా పత్రాలు ఇవ్వనున్నారు. అభినందన సభ తరువాత తిరిగి అవే బస్సుల్లో జిల్లాలకు తీసుకువస్తారు. ఆ తరువాత ఎంపికైన అభ్యర్థులకు పాఠశాలల నిర్వహణ, బోధన, పరిపాలన, ఇతర అంశాలపై జిల్లాలవారీగా పది రోజులపాటు శిక్షణ ఇస్తారు. ఇప్పటివరకూ డీఎస్సీ ద్వారా ఎంపికైన టీచర్లను కౌన్సెలింగ్‌లోనే పాఠశాలలు కేటాయించేవారు. ఈ పర్యాయం పదిరోజుల శిక్షణ ఇచ్చిన తరువాత పాఠశాలలకు పంపాలని ప్రభుత్వం నిర్ణయించింది. ప్రతి ఉద్యోగికి శిక్షణ అవసరమని విద్యాశాఖ అధికారి ఒకరు తెలిపారు. దసరా సెలవుల తరువాత కొత్త టీచర్లకు పాఠశాలలు కేటాయించనున్నట్టు పేర్కొన్నారు.



జిల్లాకు ఉపాధ్యాయుల ఎంపిక జాబితా

- కమిటీ ఆమోదమే తరువాయి..

నరసన్నపేట, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఉపాధ్యాయుల నియామక ప్రక్రియ దాదాపు పూర్తయింది. ఇటీవల డీఎస్సీ మెరిట్ జాబితాలో అర్హులైన అభ్యర్థుల ధ్రువీకరణ పత్రాలను మూడు విడతల్లో పరిశీలన చేపట్టారు. అనంతరం రాష్ట్ర విద్యాశాఖ అధికారులు కొత్త ఉపాధ్యాయుల ఎంపిక జాబితాను చేపట్టి జిల్లా కమిటీ ఆమోదం మేరకు జిల్లా విద్యాశాఖాధికారికి శనివారం పంపించినట్లు సమాచారం. కలెక్టర్ నేతృత్వంలో కమిటీ ఈ జాబితాలోని అభ్యర్థుల ఎంపిక ప్రక్రియను మరోసారి క్షుణ్ణంగా పరిశీలించి, ఆమోదించిన తరువాత అభ్యర్థులకు కాల్‌లెటర్స్ పంపేందుకు ఏర్పాట్లు చేశారు. ఈ ఏడాది ఏప్రిల్‌లో పరీక్షలను నిర్వహించి, ఆగస్టు 13న ప్రభుత్వం ఫలితాలను ప్రకటించింది. గత నెలలో మెరిట్ జాబితాను ప్రకటించి రోస్టర్ ప్రాతిపదికన అభ్యర్థుల ఎంపిక నిర్వహించారు. జిల్లాలో మొత్తం 543 ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయనున్నారు. జిల్లాపరిషత్ ఆధ్వర్యంలో 407, మునిసిపాలిటీ ఆధ్వర్యంలో 51, గిరిజన సంక్షేమశాఖ ఆధ్వర్యంలో 85 మంది ఉపాధ్యాయులను (మిగతా 6వ పేజీలో..)



నర్సింగపల్లిలో నానో ఎరువు వేసిన వరిపంట..

నానో.. నోనో అనొద్దు!

- టెక్కలి మండలం నర్సింగపల్లి గ్రామానికి చెందిన దారపు పాపారావు అనే రైతు సుమారు పది ఎకరాలు కౌలుకు తీసుకుని వరి సాగు చేస్తున్నాడు. నాట్లు వేసిన తర్వాత యూరియా అందుబాటులో లేకపోవడంతో నానో రసాయన ఎరువును తెచ్చి.. డ్రోన్‌తో పిచికారీ చేయించాడు. మొదటి వారం ఆ రసాయన ఎరువు పూర్తిగా పనిచేయనట్టు కనిపించడంతో ఆందోళన చెందాడు. కానీ 20రోజుల తర్వాత వరిపంట ఏపుగా పెరిగి దుబ్బు కట్టడంతో ఆనంద పడుతున్నాడు.

- ఆలస్యంగా ఫలితమిస్తున్న ఎరువు
- అవగాహన లేక తగ్గిన వినియోగం

టెక్కలి రూరల్, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): ఖరీఫ్ సాగు వేళ.. జిల్లాలోని చాలామంది రైతులు ఎరువులు సకాలంలో అందక ఇబ్బందులు పడుతున్నారు. కాగా అన్నదాతలకు భారం తగ్గించేలా, ఇబ్బందులు తొలగించేలా యూరియాకు ప్రత్యామ్నాయంగా ప్రభుత్వం నానో రసాయనిక ఎరువులను అందుబాటులోకి తెచ్చింది. కానీ దీనిపై రైతులకు అవగాహన కల్పించడంలో అధికారులు విఫలమవుతున్నారనే విమర్శలు ఉన్నాయి. ఫలితంగా - (మిగతా 6వ పేజీలో..)



జాతీయ లోక్‌అదాలత్‌లో పాల్గొన్న జిల్లాన్యాయాధికారి జేపీ మౌలానా

లోక్‌అదాలత్‌లో 2,305 కేసుల పరిష్కారం

శ్రీకాకుళం లీగల్, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళంలోని జిల్లా న్యాయస్థానాల సముదాయంలో శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో మొత్తం 2,305 కేసులు పరిష్కారమయ్యాయని జిల్లా న్యాయాధికారి జేపీ మౌలానా తెలిపారు. ఇందులో రూ.6,83,10,419 విలువ గల 104 సివిల్ కేసులు పరిష్కారమయ్యాయి. రూ.52,81,673 విలువైన 2174 క్రిమినల్ కేసులు, రూ.11,96,300 విలువైన 27 ప్రీ లిటిగేషన్ కేసులు పరిష్కారమయ్యాయని న్యాయాధికారి జేపీ మౌలానా వివరించారు.

- ఈ నెల 3న సారవకోట మండలం అవలంగిలో కల్తీ మద్యం గుట్టు రట్టయింది. ఎక్సైజ్ అధికారుల తనిఖీల్లో 212 లీటర్ల కల్తీ మద్యం, 1700 ఖాళీ సీసాలు, మూతలు, లేబుల్స్ పట్టుబడ్డాయి. మద్యంసాసీలకు సీల్ తీసి తక్కువ ఖరీదు మద్యాన్ని కలిపేసి విక్రయించేందుకు సిద్ధంగా ఉంచినట్టు ఎక్సైజ్ అధికారులు గుర్తించారు. బ్రాండెడ్ మద్యం కల్తీ చేసే పరికరాలతోపాటు కొంత సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు.



కల్తీ మద్యం
కలకలం

- అవలంగిలో ఇటీవల భారీగా పట్టుబడిన వైనం
- ప్రీమియం బ్రాండ్లలో చీప్‌లిక్కర్
- మద్యంలో ఒడిశా సారా కలిపి విక్రయాలు



రణస్థలం, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): జిల్లాలో కల్తీ మద్యం విక్రయాలు కొనసాగుతూనే ఉన్నాయి. జిల్లావ్యాప్తంగా 158 ప్రైవేటు మద్యం దుకాణాలు ఏర్పాటయ్యాయి. చాలా ప్రాంతాల్లో కల్తీ మద్యం విక్రయిస్తున్నట్టు ఆరోపణలున్నాయి. గతంలో కల్తీ మద్యంలో ఆరితేరిన వారు షాపుల్లో దర్శనమిస్తుండడంతో ఈ అనుమానాలు బలపడుతున్నాయి. వైసీపీ హయాంలో మద్యం విధానం అస్తవ్యస్తంగా ఉండేది. అప్పట్లో ప్రభుత్వమే నేరుగా మద్యం దుకాణాలు నడిపేది. నాసిరకం మద్యం అమ్మకాలు జరిగేవి. దీంతో జిల్లాలో పొరుగు మద్యం ఎక్కువగా చలామణిలో ఉండేది. ఇదే అదునుగా కల్తీ మద్యం సైతం రాజ్యమేలేది. ఆమదాలవలసలో అప్పట్లో భారీ డంప్ లభ్యమైంది. జిల్లా మీదుగా ఒడిశా మద్యం తరలింపు, తెలంగాణ నుంచి మద్యం దిగుమతి.. ఇలా రకరకాల ఘటనలు వెలుగుచూశాయి. మరోవైపు జే బ్రాండ్ మద్యం అమ్మకాలతో ప్రజారోగ్యం సైతం క్షీణించింది. అపై మద్య నిషేధం చేస్తామన్న జగన్ హామీ అటకెక్కింది. ఏడాదికి 25శాతం షాపులు మూసివేయిస్తానన్న హామీ కూడా కార్యరూపం దాల్చలేదు. ఇలా వైసీపీ హయాంలో మద్యం పాలసీ అబాసుపాలైంది. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం నాణ్యమైన మద్యం అందిస్తామని హామీ ఇచ్చింది. అందుకు తగ్గట్టుగానే పాత ప్రీమియం బ్రాండ్లన్నీ అందు బాటులోకి వచ్చాయి. అయితే ఇప్పుడు కూడా కల్తీ మద్యం వెలుగు చూస్తుండడం ఆందోళన కలిగిస్తోంది. ఇటీవల సారవకోట మండలం అవలంగిలో పెద్దఎత్తున కల్తీ మద్యం పట్టుబడడం చర్చనీయాంశంగా మారింది. వైసీపీ హయాంలో కోటబొమ్మాళి ప్రభుత్వ మద్యం దుకాణంలో కల్తీ జరిగింది. కోర్టులో నడుస్తున్న ఆ కేసులో సూత్రధారిగా ఉన్న అప్పటి సూపర్‌వైజర్.. తాజాగా అవలంగిలో కల్తీ మద్యంతో పట్టుబడడం గమనార్హం. ప్రస్తుత కూటమి ప్రభుత్వం మేల్కొనకపోతే మాత్రం వైసీపీ మరక అంటడం ఖాయమని పలువురు - (మిగతా 6వ పేజీలో..)

ప్రత్యేక దృష్టి..

జిల్లాలో కల్తీమద్యం నివారణపై ప్రత్యేకంగా దృష్టిపెట్టాం. తనిఖీలు ముమ్మరం చేశాం. అవలంగిలో స్టింగ్ ఆపరేషన్ నిర్వహించి పట్టుకున్నాం. నిబంధనల మేరకు మద్యం వ్యాపారం నిర్వహించాలని యజమానులకు ఆదేశాలిచ్చాం. అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవు. ఎక్కడైనా మద్యం కల్తీ జరుగుతు న్నట్టు అనుమానాలు వస్తే వెంటనే ఫిర్యాదు చేయాలి.

- సీహెచ్ తిరుపతినాయుడు, జిల్లా ఎక్సైజ్ అధికారి, శ్రీకాకుళం

ఉన్నతాధికారుల దృష్టికి..

పోస్టల్ కార్యాలయం శిథిలావస్థకు చేరుకుంది. ఈఏడాది జూన్‌లో కూడా పెచ్చులూడి పడడంతో సిబ్బందికి గాయాలయ్యాయి. శనివారం మరోసారి పెచ్చులూడిపడడంతో పోస్టాఫీస్ పని నిమిత్తం వచ్చిన ఓ రిటైర్డ్ ఉపాధ్యాయుడు స్వల్పంగా గాయపడ్డారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. వీలైనంత త్వరగా టెండరు ప్రక్రియ పూర్తిచేసి పనులు ప్రారంభించాలని కోరాం. మరమ్మతులు కన్నా నూతన భవన నిర్మాణానికి ఉన్నతాధికారులు చర్యలు చేపడితే మంచిది.

- షణ్ముఖరావు, పోస్టల్ ప్రధాన అధికారి, ఇచ్ఛాపురం

చర్యలు తీసుకోవాలి

రోజూ ఖాతాదారులతో పోస్టాఫీసు రద్దీగా ఉంటుంది. పెద్ద ప్రమాదం జరగకముందే భవన నిర్మాణానికి ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలి. ఖాతాదారులకు ఏ ప్రమాదం జరిగినా.. మా సిబ్బందిపై తిరగబడే అవకాశం ఉంది. శిథిల భవనంలో బిక్కుబిక్కుమంటూ విధులు నిర్వహిస్తున్నాం.

- సంతోష్, క్లర్క్, ఇచ్ఛాపురం పోస్టాఫీస్



ఇచ్ఛాపురం పోస్టాఫీసులో కింద పడిన శ్లాబు పెచ్చులు

పోస్టాఫీసులో పెచ్చులూడిన శ్లాబు

- ఇచ్ఛాపురంలో ఘటన..
- ఒకరికి గాయాలు
- యాభై ఏళ్ల క్రితంనాటి భవనం
- బిక్కుబిక్కుమంటూ సిబ్బంది విధులు

ఇచ్ఛాపురం, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): ఇచ్ఛాపురంలోని పోస్టాఫీసు శిథిలావస్థకు చేరుకుంది. శనివారం ఉదయం 10గంటల సమయంలో పోస్టాఫీసు కార్యాలయం శ్లాబు పెచ్చులూడి పడ్డాయి. ఆ సమయంలో అక్కడ కుర్చీలో కూర్చొన్న వీకేపేటకు చెందిన రిటైర్డ్ ఉపాధ్యాయుడు బాబూరావుపై ఆ పెచ్చులు పడడంతో స్వల్పంగా గాయపడ్డారు. పెచ్చులూడిన శబ్దం విని అధికారులు, సిబ్బంది, ఖాతాదారులు భయంతో బయటకు పరుగులు తీశారు. ఎటువంటి ప్రమాదం జరగకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు. బాబూరావును ఆస్పత్రికి తరలించారు. కాగా నిత్యం ఇక్కడ ఇదే పరిస్థితి ఎదురవుతోందని కార్యాలయం సిబ్బంది ఆవేదన చెందుతున్నారు. శిథిలావస్థకు చేరుకోవడంతో బిక్కుబిక్కుమంటూ విధులు నిర్వహిస్తున్నామని వాపోతున్నారు. ఎప్పుడు కూలిపోతుందో తెలియని పరిస్థితి నెలకొందని పేర్కొంటున్నారు.

- ఐదు దశాబ్దాల కిందట నిర్మాణం..

జిల్లాలో పోస్టల్‌శాఖ ప్రధాన కార్యాలయాల్లో ఇచ్ఛాపురం ఒకటి. ఇక్కడ వందలాది మంది ఖాతాదారులు ఉన్నారు. పైగా ఆధార్ వంటి పౌరసేవలు, బ్యాంకింగ్ సేవల కోసం నిత్యం సుమారు 200 మంది ఖాతాదారులు వస్తుంటారు. వారంతా శిథిల భవనంతో ఇబ్బందులు (మిగతా 6వ పేజీలో..)

రైల్వే ప్రయాణికులపై 'బరువు' భారం

- లగేజీ చార్జీల వసూలుకు సన్నాహాలు
- ఏసీలో ఒక్కొక్కరికీ 70కిలోల వరకూ అనుమతి
- జనరల్, సెకండ్ క్లాస్‌లో మాత్రం 35 కిలోలకే పరిమితి



పలాస, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): విమానాల్లో లగేజీకి చార్జీల మాదిరి.. రైలులో ప్రయాణికులకు కూడా త్వరలో వసూలు చేయనున్నారు. రైల్వేశాఖ ఇప్పటికే దీనికి సంబంధించిన విదివిధానాలు ప్రకటించింది. కొన్ని రాష్ట్రాల్లో తొలుత అమలు చేయడానికి శ్రీకారం చుట్టింది. మన రాష్ట్రంలో కూడా తొందరలోనే లగేజీ చార్జీల విధానం అమల్లోకి రానుంది. ఇటీవల ఈ విషయాన్ని రైల్వేశాఖ మంత్రి అశ్వనీవైష్ణవ్ ప్రకటన ద్వారా వెల్లడించారు. ఇదిలా ఉండగా సామాన్యుడిపై భారం మోపి సంపన్నులపై రైల్వేశాఖ బాదుడు తగ్గించడం సర్వత్రా విమర్శలకు దారితీస్తోంది. ఎక్కువగా రైలులో పేద, మధ్యతరగతి ప్రజలే ప్రయాణిస్తుండడంతో వారికి అదనపు లగేజీ ఉంటే అదనపు భారం పడనుంది.

- ఫస్ట్‌క్లాస్ ఏసీ రైలులో ప్రయాణికులు ఒక్కొక్కరు గరిష్ఠంగా 70కిలోల బరువు వరకూ ఎటువంటి రుసుం చెల్లించకుండా లగేజీని తీసుకెళ్లవచ్చు. ద్వితీయశ్రేణి ఏసీలో ఒక్కో ప్రయాణికుడు 50 కిలోలు, తృతీయశ్రేణి ఏసీతోపాటు స్లీపర్‌క్లాస్‌లో ప్రయాణికులు 40కిలోలు చొప్పున లగేజీ ఉచితంగా తీసుకెళ్లవచ్చు. జనరల్, సెకండ్ క్లాస్ సిటింగ్ ప్రయాణికులకు మాత్రం కేవలం 35కిలోల వరకూ లగేజీతో ప్రయాణించవచ్చు. అదనంగా 15కిలోల వరకూ లగేజీ తీసుకువెళ్లడానికి సడలింపు ఇచ్చారు. దీనికన్నా అదనంగా లగేజీ తీసుకెళితే డబ్బులు చెల్లించాలి. వందేభారత్, సూపర్‌ఫాస్ట్ వంటి రైళ్లను క్రమేపీ అన్ని రాష్ట్రాల్లో ప్రవేశపెడుతున్న తరుణంలో అందులో లగేజీతో ప్రయాణిస్తే ఇబ్బందులు ఉన్నాయని రైల్వేశాఖ గుర్తించింది. అదనంగా రైలుకు భారం పడుతుండడంతో ముందస్తుగా లగేజీపై నియంత్రణ చేస్తూ ప్రజల్లో చైతన్యం తీసుకువస్తోంది. ప్రయోగాత్మంగా కొన్ని రాష్ట్రాల్లో నియంత్రణ లగేజీ విధానం విజయవంతమైతే అన్ని రాష్ట్రాల్లో దీన్ని అమలు చేయడానికి రైల్వేశాఖ కసరత్తు ప్రారంభిస్తోంది. లగేజీకి చార్జీల విధానం అమలైతే సాధారణ, మధ్యతరగతి ప్రయాణికులపై భారం పెరగనుంది. కాగా అప్పర్‌క్లాస్‌పై విధించాల్సిన లగేజీ రేట్లను సామాన్య, మధ్యతరగతి ప్రజలపై విధిస్తుండడం పట్ల సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది.



పలాస రైల్వేస్టేషన్ వద్ద ప్రయాణికుల సరుకులు తీసుకెళ్తున్న రైల్వే లైసెన్స్ పోర్టర్



పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సుల కోసం ఆర్టీసీ కాంప్లెక్స్‌లో వేచి ఉన్న ప్రయాణికులు



ఆర్టీసీ కాంప్లెక్స్‌లో ఖాళీగా ఉన్న నాన్‌స్టాప్ టిక్కెట్ కౌంటర్

ఉచితం కళకళ.. నాన్‌స్టాప్ వెలవెల

- ప్రయాణికులు తగ్గిన వైనం
- అత్యంత రద్దీగా ఉండే విశాఖ కౌంటర్లు ఖాళీ

అరసవల్లి, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉచిత బస్సు (స్త్రీ శక్తి) పథకాన్ని మహిళలు, విద్యార్థినులు పెద్ద ఎత్తున వినియోగించుకుంటున్నారు. స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి పలాస, విశాఖపట్నం వెళ్లే బస్సుల్లో అత్యధిక రద్దీ ఉంటుంది. ఈ రూట్లలోనే సంస్థకు అత్యధిక ఆదాయం కూడా సమకూరేది. శ్రీకాకుళం నుంచి విశాఖపట్నం వెళ్లే వారితో నాన్-స్టాప్ కౌంటర్లు నిత్యం ప్రయాణికులతో కిటకిటలాడేవి. కానీ స్త్రీ శక్తి పథకం అమలులోకి వచ్చాక అందుకు పూర్తి విరుద్ధమైన పరిస్థితులు కనిపిస్తున్నాయి నాన్-స్టాప్ కౌంటర్లు వెలవెలబోతున్నాయి. ప్రయాణికులు లేకపోవడంతో డ్రైవర్లు కౌంటర్ల వద్ద నిరీక్షించాల్సి వస్తోంది. అదే సమయంలో ఉచిత బస్సులైన పల్లె వెలుగు, అల్ట్రా పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్ సర్వీసుల కోసం ప్రయాణికులు పోటీ పడుతున్నారు. సంబంధిత ప్లాట్‌ఫారాల వద్ద పెద్ద ఎత్తున బస్సుల కోసం నిరీక్షిస్తున్నారు. బస్సుల్లో సీట్ల కోసమూ పోటీ పడుతున్నారు. నాన్‌స్టాప్ బస్సుల ఆక్యుపెన్సీ రేషియో (ఓఆర్) గత నెల రోజుల కాలంలో 76 శాతం నుంచి 62 శాతానికి పడిపోయిందని..రోజుకు సగటున రూ.91 వేల నష్టం వస్తోందని శ్రీకాకుళం ఒకటో డిపో మేనేజర్ అమరసింహుడు తెలిపారు. మొత్తం 25 నాన్‌స్టాప్ సర్వీసులు తిరుగుతున్నాయని చెప్పారు. ఆగస్టు నెలతో పోలిస్తే ఈ నెలలో ఆక్యుపెన్సీ రేషియో తక్కువగా ఉందని ఆయన తెలిపారు.



ప్రయాణికులతో కళకళలాడుతున్న శ్రీకాకుళం ఆర్టీసీ కాంప్లెక్స్



ప్రయాణికులు లేకపోవడంతో ఖాళీగా ఉన్న నాన్‌స్టాప్ బస్సులు

అక్షరాల వారధి.. హిందీ

- జాతీయ భాషపై పెరుగుతున్న మక్కువ
- నేడు హిందీ దివస్

సోంపేట, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): హిందీ.. జాతీయ భాషగా అందరికీ పరిచయమే. కొంచెం భిన్నాభిప్రాయాలు ఉన్నప్పటికీ... దేశంలోని ప్రజలందరినీ కలపడంలో దీని పాత్రను కాదనలేం. కొన్ని రాష్ట్రాల్లో హిందీపై వ్యతిరేకత ఉన్నప్పటికీ.. దేశంలోని ఏ ప్రాంతానికి వెళ్లినా...హిందీ భాష తెలిస్తే చాలు... సునాయాసంగా మనగలగవచ్చునడంలో సందేహం లేదు. ఇప్పుడు అనేక దేశాల్లో హిందీ మాట్లాడుతున్న వారు ఉంటున్నారు.



హిందీ బోర్డులు ప్రదర్శిస్తున్న చిన్నారి

ఎంతో చరిత్ర

స్వాతంత్ర్య సంగ్రామ సమయంలో దేశ ప్రజలందరినీ ఒక్క తాటిపైకి తేవడంలో హిందీ భాష కీలక పాత్ర పోషించింది. దక్షిణాన ఈ భాష వ్యాప్తి కోసం మహాత్ముడే కదిలి వచ్చి సభలు నిర్వహించారు. వివిధ ప్రాంతాల్లో అక్కడి ప్రజలు విభిన్న భాషలు మాట్లాడుతున్నారు. కానీ హిందీ అనేది దాదాపుగా అన్ని రాష్ట్రాల్లోనూ ఉంది. దీని వల్ల ఒక ప్రాంతం వారు ఇంకొక ప్రాంతంలో పర్యటించడానికి... జీవించడానికి అవకాశం ఏర్పడుతుందనడంలో సందేహం లేదు. మన రాజ్యాంగంలోని ఆర్టికల్ (343)(1) సవరణను అనుసరించి హిందీని రాజభాషగా ఆమోదించారు. ఆచార్య రామచంద్ర శుక్ల వీరగధకాల్ హిందీ సాహిత్య పరిణతికి కృషి చేశారు. స్వాతంత్ర్యం రాకపూర్వం 'సత్య హరిశ్చంద్ర' నాటకం హిందీ భాష ప్రాచుర్యం పొందడానికి కారణమైంది. ప్రపంచ వ్యాప్తంగా 200 వరకు విశ్వవిద్యాలయాలు హిందీ భాషకు సంబంధించిన కోర్సులను నిర్వహిస్తున్నాయి. ఏడాదికి రెండుసార్లు చెన్నై, హైదరాబాద్, అలహాబాద్, వార్ధలో హిందీ ప్రచార సభలు, పరీక్షలు నిర్వహిస్తున్నారు. వేలాదిమంది విద్యార్థులు ఈ పరీక్షలకు హాజరవుతున్నారు.



హిందీపై అవగాహన కోసం చార్టులు సిద్ధం చేస్తున్న నిరంజన్

ఉద్యోగ అవకాశాలు

దేశమంతా కార్పొరేట్, ప్రయివేటు పాఠశాలలు విస్తరించడంతో నిరుద్యోగ హిందీ పండిట్లకు ఉద్యోగ అవకాశాలు గణనీయంగా పెరుగుతున్నాయి. ప్రచార సమితుల కృషి మేరకు హిందీ భాషను ప్రపంచవ్యాప్తంగా 40 కోట్ల మంది అర్థం చేసుకోవడంతోపాటు మాట్లాడగలుగుతున్నారని గణాంకాలు చెబుతున్నాయి. బిహార్, ఉత్తరప్రదేశ్, ఢిల్లీ, హిమాచల్ ప్రదేశ్, మధ్యప్రదేశ్, హర్యానా, రాజస్థాన్ రాష్ట్రాల్లో హిందీ ప్రథమభాషగా, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, గుజరాత్, మహారాష్ట్ర రాష్ట్రాల్లో ద్వితీయ భాషగాను కొనసాగుతోంది.

భాషాభివృద్ధికి కృషి

ఆంధ్రప్రదేశ్‌తోపాటు దేశంలో హిందీ భాషాభివృద్ధికి ఎన్నో సంస్థలు, వ్యక్తులు కృషి చేస్తున్నారు. శ్రీకాకుళం జిల్లాలో హిందీ ప్రచారక్‌గా సేవలందిస్తున్న నిరంజన్ ఖడంగా భాషకు సంబంధించిన ప్రచారంలో కృషి చేస్తున్నారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులకు హిందీ భాషపై అవగాహన కల్పిస్తున్నారు. 'హిందీ నేర్చుకుందాం' అనే పుస్తకాన్ని రచించి...పాఠశాలలకు పంచిపెట్టారు. ప్రస్తుతం పల్లెల్లో సైతం అనేక మంది హిందీ భాష నేర్చుకోవడానికి ఆసక్తి చూపుతున్నారు.

హిందీ వ్యాప్తి కోసం కృషి చేయాలి

ఉన్నత పాఠశాలల్లో హిందీ భాష బోధనకు పిరియడ్స్ సంఖ్య పెంచాలి. ఉత్తీర్ణత మార్కులను 35కు పెంచితే విద్యార్థులకు హిందీపై మక్కువ పెరుగుతుంది. మూడో తరగతి నుంచి ప్రభుత్వ పాఠశాలల్లో హిందీ తప్పనిసరి చేయాలి. ఆంధ్రప్రదేశ్‌లో చదువుతున్న ఒడియా మైనారిటీ విద్యార్థులకు రెండో భాషగా హిందీని బోధించాలి.

- నిరంజన్ ఖడంగ, హిందీ ప్రచారక్, ఉపాధ్యాయుడు

కల్తీ మద్యం కలకలం

(ఐదో పేజీ తరువాయి)

పేర్కొంటున్నారు.

● అలా కలిపేస్తున్నారు..

జిల్లాలో చాలా ప్రాంతాల్లో మద్యం అడల్ట్రేషన్, కార్కింగ్ జరుగుతున్నట్టు ఆరోపణలు ఉన్నాయి. ప్రీమియం బ్రాండ్ మద్యం సీసాల్లో చీప్‌లిక్కర్ మద్యాన్ని కలపడం, చీప్ లిక్కర్‌లో నీరు వేయడం వంటివి చేసి విక్రయిస్తున్నారు. అవలంగిలో ప్రధానంగా ఆఫీసర్ చాయ్స్ (ఓసీ), ఏపీ బ్లాక్, సిల్వర్ స్టిక్ బ్రాండ్లతో ప్రీమియం బ్రాండ్లను కల్తీ చేస్తున్నట్టు బయటపడింది. ఎక్సైజ్ అధికారులు ఆ గ్రామానికి దగ్గర్లో ఉన్న దుర్గా వైన్‌షాపును తనిఖీ చేయగా 54 కల్తీ మద్యం బాటిళ్లు దొరికాయంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. ప్రతి సీసాపై ఏపీ బేవరజేస్ కార్పొరేషన్‌కు సంబంధించి లేబుల్ ఉంటుంది. సీల్ ఏమాత్రం తెగకుండా సీసామూతను ఓ యంత్రంతో లేపుతారు. వాటిలో మద్యాన్ని కల్తీ చేసి అనుమానం రాకుండా సీల్‌తో కూడిన మూతను మళ్లీ వేస్తారు. జిల్లావ్యాప్తంగా కల్తీ మద్యంపై ఫిర్యాదులు వస్తున్నా.. మా మ్మూళ్ల మత్తులో ఎక్సైజ్ అధికారులు పట్టించు కోవడం లేదనే ఆరోపణలు ఉన్నాయి.

● ఇప్పటికీ ఒడిశాలో సారా చలామణిలో ఉంది. అక్కడ అధికారికంగానే అమ్ముతున్నారు. సరిహద్దు ప్రాంతాల నుంచి సారా తక్కువ ధరకు తెచ్చి ఇక్కడి మద్యంలో కల్తీ చేస్తున్నారన్న అనుమానాలు ఉన్నాయి. ఛత్తీస్‌గఢ్‌లో సైతం కన్యూమబుల్ అనే ఆల్కాహాల్ దొరుకుతుంది. తక్కువ ధర ఆపై ఎక్కువ నిషా ఉండడంతో అక్కడి నుంచి దీనిని తెచ్చి మద్యంలో కలిపేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. కూటమి ప్రభుత్వం కల్తీ మద్యంపై దృష్టి పెట్టకపోతే మాత్రం జిల్లాలో సైతం పాత పరిస్థితులే పునరావృతం అవుతాయి. అందుకే మద్యం షాపుల్లో తనిఖీలు, అంతర్ రాష్ట్ర సరిహద్దు చెక్ పోస్టులు కట్టుదిట్టం చేయడం, ఈగల్ టీమ్‌ను మరింత బలోపేతం చేస్తేనే మంచిదని పలువురు అభిప్రాయపడుతున్నారు.

శివలింగాన్ని తాకిన కిరణాలు

కవిటి, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ముత్యాలపేట గ్రామంలోని మహామృత్యుంజయేశ్వర స్వామి ఆలయంలో శివలింగానికి శనివారం తెల్లవారు జామున సూర్య కిరణాలు తాకాయి. ఎప్పటిలాగే అర్చకుడు ఆలయాన్ని తెరిచి పూజలు నిర్వహిస్తున్న సమయంలో ఒక్కసారిగా సూర్య కిరణాలు శివలింగంపై పడ్డాయి. ఆ సమయంలో ఉన్న భక్తులు ఈ దృశ్యాన్ని మొబైళ్లలో చిత్రీకరించారు. విషయం తెలుసుకున్న భక్తులు వచ్చి స్వామిని దర్శించుకున్నారు. కొన్ని నిమిషాల పాటు కిరణాలు శివలింగాన్ని తాకాయని గ్రామస్థులు తెలిపారు.



లింగంపై పడిన సూర్య కిరణాలు

నానో.. నోనో అనొద్దు!

(ఐదో పేజీ తరువాయి)

నానో వినియోగంపై రైతులు ఆసక్తి చూపడం లేదు. యూరియా బస్తాల కోసమే ఎదురు చూస్తున్నారు. జిల్లాలో 4,47,387 ఎకరాల్లో రైతులు వరిసాగు చేస్తున్నారు. జిల్లాకు 23,474 నానో ఎరువుల బాటిళ్లను కేటాయించారు. దీనిపై రైతులకు అవగాహన లేకపోవడంతో నానో ఎరువులు చెల్లుబాటు కావడం లేదని వ్యాపారులు పేర్కొంటున్నారు.

తక్కువ పెట్టుబడితో..

ప్రభుత్వం రైతుసేవా కేంద్రాల ద్వారా బస్తా యూరియాను రూ.267కు విక్రయిస్తోంది. అదే బహిరంగ మార్కెట్లో రూ.300 నుంచి రూ.400 వరకు విక్రయిస్తున్నారు. నానో యూరియా అయితే 500 మి.లీ. బాటిల్ మార్కెట్‌లో రూ.225 నుంచి రూ.249కి దొరుకుతోంది. ఎకరాకు 550 మి.లీ. రసాయన ఎరువు సరిపోతుంది. ప్రభుత్వం డీఏపీ బస్తాను రూ.1350కి విక్రయిస్తోంది. నానో డీఏపీ అయితే లీటర్ రూ.595కే దొరుకుతోంది. ఎరువుల బస్తాలయితే మోయాలి. కానీ నానో సీసాలు సులువుగానే తీసుకెళ్లిపోవచ్చని అధికారులు చెబుతున్నారు. కాగా నానో ఎరువుల వల్ల దిగుబడి తగ్గిపోతుందనే అపోహ కొంతమంది రైతుల్లో ఉంది. గతేడాది నానో ఎరువులు చల్లి ఇబ్బందులు పడ్డామని పేర్కొంటున్నారు. అయితే నానో ఎరువుల్లో గతేడాది 20 శాతం నత్రజని ఉండేదని, ఈ ఏడాది దానిని 40 శాతానికి పెంచామని అధికారులు చెబుతున్నారు. దిగుబడి బాగా వస్తుందని స్పష్టం చేస్తున్నారు.

దోమపోటు లేదు

గతంలో యూరియా అధికంగా ఎకరాకు మూడు నుంచి ఐదు బస్తాల వరకు వినియోగించేవారు. దీంతో వరినాట్లు వేయగానే పురుగుపట్లు కనిపించేవి. మళ్లీ మందులు పిచికారీ చేసేవారు. ఈ ఏడాది ఎకరాకు 25 కిలోలు చొప్పున మాత్రమే.. మూడు విడతల్లో వినియోగించాలని అధికారులు చెబుతున్నారు. గతేడాది కన్నా యూరియా వినియోగం తగ్గడంతో ఈ ఏడాది ఎక్కడా దోమపోటు తెగులు కనిపించడం లేదని పేర్కొంటున్నారు. మోతాదుకు మించి యూరియా వినియోగించరాదని స్పష్టం చేస్తున్నారు.

తీరంలో చేప పిల్లలపై వల

- అక్రమంగా వేటకు వేలం
- ఒడిశా దళారులతో కొంతమంది పెద్దల చీకటి ఒప్పందం
- రూ.7.50 లక్షలకు పాట



భావనపాడు సముద్ర తీరం

సంతబొమ్మాళి, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): భావనపాడు సముద్రతీరం అపార మత్స్య సంపదకు నిలయం. ఇక్కడ ఉన్న మత్స్య సంపదపై కొంతమంది అంతర్రాష్ట్ర దళారుల కన్ను పడింది. అక్రమ మార్గంలో చేప పిల్లలను ఎత్తుకెళ్లేందుకు భావనపాడులోని కొంతమంది పెద్దలతో చీకటి ఒప్పందం కుదుర్చుకున్నారు. ఈమేరకు రూ.7.50 లక్షలు చెల్లించేందుకు ఒప్పందం కుదిరింది. చేప పిల్లలు ఎక్కువగా తీరంలోనే ఉంటాయి. సముద్రంలో వేటాడి మత్స్య సంపద పట్టుకోవడంపై ఎవరికీ అభ్యంతరం ఉండదు. కానీ తీరంలో చేప పిల్లలు వేటాడడాన్ని ప్రభుత్వాలు నిషేధించాయి. సముద్రంలో మత్స్యసంపద వృద్ధి చెంది... తద్వారా మత్స్యకారులకు ఉపాధి పొందేందుకు వీలుగా చేపలు గుడ్లు పెట్టే ఏప్రిల్ 15వ తేదీ నుంచి జూన్ 15 వరకు వేట నిషేధాన్ని అమలు చేస్తున్నారు. కానీ తీరంలో మాత్రం చేప పిల్లలను వేటాడం పూర్తిగా నిషేధం.

నిబంధనలకు విరుద్ధంగా..

సముద్ర తీరంలో వేట అక్రమమని.. నిబంధనలకు విరుద్ధమని తెలిసినా.. స్థానిక పెద్దలు దళారులతో ఒప్పందం కుదుర్చుకోవడం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. గతంలో కూడా ఇక్కడి కొంత మంది పెద్దలు పశ్చిమ బెంగాల్‌కు చెందిన వారితో చీకటి ఒప్పందం చేసుకున్నారు. ఆ సమయంలో చేప పిల్లలను పట్టేందుకు వచ్చిన పశ్చిమ బెంగాల్ వాసులను జిల్లా మత్స్యశాఖ అధికారులు అడ్డుకున్నారు. ఒడిశా, పశ్చిమ బెంగాల్‌లో సముద్ర తీరంలో చేపపిల్లల వేట నిషేధాన్ని కఠినంగా అమలు చేస్తుండడంతో అక్కడి దళారులు మన ప్రాంతంపై కన్నేశారు. ఒడిశా వారు ఇచ్చిన డబ్బులను భావనపాడు పంచాయతీలో గ్రామాల వారీగా పంపిణీ చేసినట్టు ప్రచారం జరుగుతోంది. ఈ ఒప్పందంలో పాల్గొన్న గ్రామ పెద్దలకు భారీ స్థాయిలో ముడుపులు అందినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. మత్స్యకారుల్లో చాలా మంది నిరక్షరాస్యులు కావడం... కులం కట్టుబాట్లు ఉండడంతో పెద్దల మాట కాదనలేని స్థితిలో ఉన్నారు. ఇక్కడి చేప పిల్లలను ఇతర రాష్ట్రాలకు తరలించుకుపోతే... ఆ తరువాత సముద్రంలో వేటకు వెళితే మత్స్యసంపద దొరకక తాము ఉపాధి కోల్పోతామని కొంతమంది మత్స్యకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మత్స్యశాఖ అధికారులు స్పందించి... అక్రమ వేటను అడ్డుకోవాలని వారు కోరుతున్నారు.



సముద్ర తీరంలో చేపపిల్లల నిల్వకు వేసిన వలలు (ఫైల్)

చర్యలు తప్పవు

సముద్ర తీరంలో చేపపిల్లలను ఎవరైనా అక్రమంగా వేటాడితే చర్యలు తప్పవు. గతంలో కూడా భావనపాడు తీరంలో ఇటువంటిది జరిగినప్పుడు అడ్డుకున్నాం. ఇప్పుడు మళ్లీ ఈ విషయం మా దృష్టికి వచ్చింది. అక్రమంగా వేటాడేవారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటాం.

- సత్యనారాయణ, డీడీ, మత్స్యశాఖ, శ్రీకాకుళం

జిల్లాకు ఉపాధ్యాయుల ఎంపిక జాబితా

(ఐదో పేజీ తరువాయి)

నియమించనున్నారు. సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులను 113మంది, ఇంగ్లీషులో 65 మంది, తెలుగు- 37, బయాలజీ -34, గణితం-33, ఫిజికల్ సైన్సు-14, సోషల్ స్టడీస్-70, ఫిజికల్ ఎడ్యుకేషన్-81 పోస్టులకు అభ్యర్థులను తుది జాబితాలో ఎంపిక చేయనున్నారు. కొంతమంది డీఎస్సీ అభ్యర్థులు మూడు లేదా నాలుగు పోస్టులకు ఎంపికయ్యారు. వారి నిర్ణయం మేరకు కావాల్సిన పోస్టుకు ఎంపిక చేసి.. మిగతా వాటిని మెరిట్ జాబితాలో తదుపరి అభ్యర్థులకు అవకాశం కల్పించారు. ఎంపికైన ఉపాధ్యాయులకు దసరా సెలవుల్లో పదిరోజులపాటు శిక్షణ ఇచ్చి, పోస్టింగు ఇవ్వనున్నారు. ఈ మేరకు జిల్లా అధికారులు ముమ్మర చర్యలు చేపట్టారు. ఈ విషయంపై ఇన్‌చార్జి డీఈవో రవిబాబు వద్ద ప్రస్తావించగా 'డీఎస్సీ ఎంపిక జాబితాను జిల్లా కమిటీ ఆమోదించాక రాష్ట్ర అధికారులకు పంపిస్తాం. అభ్యర్థులకు రాష్ట్ర ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఉత్తర్వులు అందజేస్తామ'ని తెలిపారు.

పోస్టాఫీసులో పెచ్చులూడిన శ్లాబు

(ఐదో పేజీ తరువాయి)

పడుతున్నారు. తరచూ శ్లాబ్ పెచ్చులూడి పడుతుండంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని భయాందోళన చెందుతున్నారు. ఇచ్ఛాపురం పోస్టాఫీసు కార్యాలయాన్ని ఐదు దశాబ్దాల కిందట నిర్మించారు. 2013లో భవనానికి మరమ్మతులు చేపట్టారు. మళ్లీ ఇప్పుడు శిథిలావస్థకు చేరుకోవడంతో పోస్టల్ శాఖ ఉన్నతాధికారులు ఈ భవనం ఆధునికీకరణకు రూ.30లక్షలు మంజూరు చేశారు. టెండర్ల ప్రక్రియలో ఉంది. వీలైనంత త్వరగా పనులు చేపట్టి భవనాన్ని ఆధునికీకరించాలని ఖాతాదారులు కోరుతున్నారు.



శ్లాబు పెచ్చులూడిన భవనంలోనే విధులు నిర్వహిస్తున్న పోస్టల్ సిబ్బంది

మహిళా సమస్యలపై సత్వర స్పందన: ఎస్పీ

శ్రీకాకుళం క్రైం, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): పోలీస్ స్టేషన్‌కు వచ్చే మహిళా ఫిర్యాదుదారుల సమస్యలపై సత్వరం స్పందించి... వారికి న్యాయం చేయాలని ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి సూచించారు. మహిళా పోలీస్ స్టేషన్ సీఐగా బాధ్యతలు చేపట్టిన వి.రామారావు శనివారం ఎస్పీని మర్యాదపూర్వకంగా కలిశారు. మహిళలతో మర్యాదగా వ్యవహరించి...వారి సమస్యలపై సానుకూలంగా స్పందించాలని ఎస్పీ ఆయనకు సూచించారు.



శాలిహుండాం వద్ద విద్యుత్ సబ్‌స్టేషన్

● ఉన్నతాధికారులకు ప్రతిపాదన

గార, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): శాలిహుండాం గ్రామంలో మరో విద్యుత్ సబ్ స్టేషన్ ఏర్పాటుకు ఆ శాఖాధికారులు చర్యలు చేపడుతున్నారు. ఈ స్టేషన్ ఐఎంవీఏ సామర్థ్యంతో ఏర్పాటుకు సంబంధించి ప్రతిపాదనలను సంబంధిత ఉన్నతాధికారులకు పంపారు. వివరాలిలా ఉన్నాయి.. ఇప్పటి వరకు గార మండలంలో తూలుగు, చల్లపేట, కళింగపట్నంలో ఇదే సామర్థ్యంతో విద్యుత్ సబ్ స్టేషన్లు ఉన్నాయి. వీటి ద్వారా మండలంలోని గృహ, వ్యవసాయ పంపు సెట్లు, రైస్ మిల్లులు, వాణిజ్య అవసరాలకు విద్యుత్ సరఫరా అవుతోంది. మొదటిలో తూలుగులో మాత్రమే విద్యుత్ సబ్ స్టేషన్ ఉండగా లో ఓల్టేజీ సమస్యలు, ఇతర సమస్యలతో వినియోగదారులుపడుతున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని పెరుగుతున్న విద్యుత్ అవసరాల దృష్ట్యా చల్లవాని పేట వద్ద, ఆ తరువాత తీర ప్రాంతమైన కళింగపట్నంలో మూడో సబ్ స్టేషన్ ఏర్పాటు చేశారు. ఈ నేపథ్యంలో తూలుగు సబ్ స్టేషన్ నుంచి సుమారు 25 కిలోమీటర్ల పొడవునా 11 కేవీ విద్యుత్ లైన్ ద్వారా బూరవెల్లి, అంబళ్లవలస పూసర్లపాడు, శాలిహుండాం, బోరవానిపేట, తంగుళ్లపేట తదితర గ్రామాల్లో గృహ, వ్యవసాయ పంపుసెట్లు, ఇతర అవసరాలకు విద్యుత్ సరఫరా చేస్తున్నారు. అయినా లో ఓల్టేజీ సమస్యతో విద్యుత్ మోటార్లు కాలిపోయి రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో శాలిహుండాంలో విద్యుత్ సబ్ స్టేషన్ ఏర్పాటు ద్వారా సమస్యలు పరిష్కారమవుతాయని భావించిన సంబంధిత అధికారులు దీని నిమిత్తం 30 సెంట్ల స్థలం అవసరమని గుర్తించారు. ఈ నేపథ్యంలో సబ్ స్టేషన్ ఏర్పాటు సమస్య, దీనికి అవసరమైన స్థలం కేటాయింపు విషయాన్ని ఎమ్మెల్యే గొండు శంకర్ దృష్టికి తీసు కువెళ్లగా ఆయన వెంటనే స్పందించారు. రెవెన్యూ అధికారులతో చర్చించి స్థలం కేటాయిం పునకు నిర్ణయించినట్లు సమాచారం. ఈ మేరకు సబ్ స్టేషన్ ఏర్పాటుకు రూ.5 కోట్లు అవసరమవుతాయని ప్రతిపాదనలు తయారు చేశారు. సబ్ స్టేషన్ నిర్మిస్తే సమస్యలు పరి ష్కారమవుతాయని ఆయా గ్రామాల ప్రజలు భావిస్తున్నారు. ఈ విషయమై ట్రాన్స్‌కో ఏఈ కమల్‌హాసన్ 'ఆంధ్రజ్యోతి' ప్రస్తావించగా శాలిహుండాం వద్ద విద్యుత్ సబ్‌స్టేషన్ ఏర్పాటుకు అవసరమైన సాంకేతిక వివరాలతో ఉన్నతాధి కారుల ఆదేశాల మేరకు నివేదిక పంపించామన్నారు. తదుపరి ఉత్తర్వుల మేరకు చర్యలు చేపడతామన్నారు.

మత్స్యకారుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

● ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు


మత్స్యకారులకు ఉపకరణాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ఎన్ఈఆర్

రణస్థలం, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): మత్స్యకారుల సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు అన్నారు. జీరుపాలేంలో శనివారం మత్స్యశాఖ ఆధ్వర్యం లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చేపల వేట నిషేధ సమయంలో 'మత్స్యకార భరోసా' ద్వారా రూ.20 వేలు సాయం అందించిన ఘనత సీఎం చంద్రబాబునాయుడుదేనన్నారు. వలసల నివారణకు హార్బర్ నిర్మాణం పనులు వేగవంతం చేస్తా మన్నారు. సాగర మత్స్యకారులకు ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన పథకం కింద వివిధ ఉపక రణాలు పంపిణీ చేశారు. ఎచ్చెర్ల, రణస్థలం మండలాల్లోని పలువురు మత్స్య కారులకు రూ.1.38 కోట్లు విలువైన వలలు, బోట్లు, ఇంజన్లు అందజేశారు. కార్యక్రమంలో కూటమి నేతలు లంక శ్యామలరావు, పిసిని జగన్నాథం నాయుడు, పిన్నింటి భానోజీనాయుడు, మహంతి అనంత్ పాల్గొన్నారు.

సాగునీటి ప్రాజెక్టులపై ప్రణాళికలు

ఆమదాలవలస, సెప్టెంబర్ 13 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని వంశధార, నాగావళి నదుల అనుసంధానంతో ఉన్న ప్రధాన సాగునీటి కాలువలు, జలాశయాలు, చెరువులను అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించాలని ఎమ్మెల్యే కూన రవికుమార్ ఆదేశించారు. శనివారం స్థానిక మునిసిపల్ కార్యాలయంలో ఇరిగేషన్, వంశధార, నాగావళి ఇంజనీరింగ్ అధికారులతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో కమిషనర్ తమ్మినేని రవి, ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

పాత పింఛన్ వర్తింపజేయాలి

ఆమదాలవలస, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన మెమో 57 ప్రకారం పాత పింఛన్ వర్తింపజేయాలని డీఎస్సీ-2003 ఉపాధ్యాయుల ఫోరం జిల్లా కన్వీనర్ కొత్తకోట శ్రీహరి కోరారు. ఈ మేరకు శ్రీకాకుళంలో ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్‌ను ఆయన స్వగృహంలో కలిసి వినతిపత్రం అందించారు. రానున్న అసెంబ్లీ సమావేశాల్లో ప్రస్తావించి తగు చర్యలు తీసుకునేలా కృషి చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఫోరం రాష్ట్ర కన్వీనర్ బలగ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్య పరిరక్షణకు సహచట్టం కీలకం

శ్రీకాకుళం లీగల్ సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): ప్రజాస్వామ్య పరిరక్షణకు సహచట్టం కీలకమని ఐక్యవేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి కుమిలి రాజేష్ అన్నారు. గుజరాతీపేటలోని విశ్వహిందూ పరిషత్ కార్యాలయంలో శనివారం ఐక్యవేదిక కార్యకర్తలకు సహచట్టంపై అవగాహన సదస్సు నిర్వహించారు. జిల్లాలో సహచట్టం సక్రమంగా అమలుకు అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి ఎల్.ధర్మారావు, బరాటం వెంకటరమణ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగ సమస్య పరిష్కారానికి ఎమ్మెల్యే కృషి

ఆమదాలవలస, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో నిరుద్యోగ సమస్య పరిష్కారానికి ఎమ్మెల్యే కూన రవికుమార్ ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నారని జిల్లా విజిలెన్స్ మోనటరింగ్ కమిటీ సభ్యుడు తోట రాము అన్నారు. శనివారం పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. జెన్‌కోతో పాటు దేశంలోని వివిధ సంస్థలు సమగ్ర సర్వేలు చేసి సూపర్ క్రిటికల్ థర్మల్ పవర్‌ప్లాంట్ ఏర్పాటు వల్ల ఎటువంటి అపాయం లేదని తెలియజేసినప్పటికీ పవర్ ప్లాంట్‌పై కొందరు వైసీపీ నేతలు తప్పుడు ప్రచారం చేస్తూ పబ్బం గడుపుకుంటున్నారని విమర్శించారు. వెన్నెలవలస వద్ద నిర్మించనున్న థర్మల్ పవర్ ప్లాంట్‌కు నిరుద్యోగ యువత, దళిత సంఘాలు మద్దతు తెలుపుతున్నాయన్నారు.

అధికారుల దృష్టికి సమస్యలు..

ఆమదాలవలస, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): జిల్లాలో క్రైస్తవుల సమస్యల పరిష్కారానికి కలిసికట్టుగా కృషి చేద్దామని జిల్లా పాస్టర్లు, లీడర్ల అసోసియేషన్ ప్రతినిధులు అన్నారు. ఈ మేరకు శనివారం స్థానిక బేతేలు చర్చిలో సంఘ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శామ్యూల్ అరుణ్‌కుమార్ తదితరులు మాట్లాడుతూ.. గత ప్రభుత్వంలో మండలాలు, పట్టణాల్లో బరియల్ గ్రౌండ్ల స్థలాల అభివృద్ధి పూర్తిగా నిర్లక్ష్యం చేయబడ్డాయన్నారు. ఈ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకు వెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు ప్రత్తిపాటి ప్రసాద్, అసిర్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వేతన సవరణ చేయాలని పోస్టుకార్డు ఉద్యమం

గుజరాతీపేట, సెప్టెంబర్ 13(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులందరికీ వేతన సవరణ చేయాలని కోరుతూ పోస్టుకార్డు ఉద్యమం చేపడుతున్నట్లు ఎస్టీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్వీ రమణ మూర్తి, జి.రమణ పేర్కొన్నారు. క్రాంతి భవన్‌లో శనివారం సమావేశం నిర్వహించారు. 12 వేతన సవరణ కమిటీ వేసి 30 శాతం ఐఆర్, మెరుగైన పీఆర్సీ అమలు చేయాలని ఉత్తరాలకు శ్రీకారం చుట్టారు. పి.రామకృష్ణ, కె.శ్రీనివాసరావు, జి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

వివాహిత అదృశ్యంపై కేసు నమోదు

శ్రీకాకుళం క్రైం, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం రూరల్ మండలం పెద్దపాడు గాంధీనగర్ కాలనీకి చెందిన వివాహిత అదృశ్యంపై రూరల్ పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. కోర్నాన మల్లికకు అదే గ్రామానికి చెందిన గోవిందతో ఈ ఏడాది మార్చిలో వివాహం జరిగింది. అయితే ఆమె శుక్రవారం ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాకపోవడంతో భర్త బంధువుల ఇళ్లలో ఆరా తీశారు. శనివారం భర్త గోవిందరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రాము తెలిపారు.

నత్తనడకన 'ఈక్రాప్' నమోదు

● కొన్ని గ్రామాల్లో 20 శాతం దాటలే..

గార రూరల్, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): ఖరీఫ్ ప్రారంభమై మూడు నెలలు కావస్తున్నా ఈ క్రాప్ నమోదు ప్రక్రియ నత్తనడకన సాగుతోంది. కొన్ని గ్రామాల్లో ఈ ప్రక్రియ ప్రారంభం కాకపోగా మరికొన్ని గ్రామాల్లో కనీసం 20 శాతం కూడా జరగలేదు. పంటల వివరాలు నమోదు చేయడం ద్వారా ఏవైనా ప్రకృతి వైపరీత్యాలు, ప్రభుత్వసాయం అందే అవకాశం ఉంటుంది. ఈ దిశలో లక్ష్యం నిర్దేశిస్తున్నా అనుకున్న మేర నెరవేరడం లేదన్న వాదనలు వినిపిస్తున్నాయి. మండల వ్యాప్తంగా సుమారు 11 వేల ఎకరాల్లో వరి సాగు చేస్తున్నారు. ఇప్పటి వరకు 7,300 ఎకరాల్లో ఈ-క్రాప్ నమోదైనట్లు ఆ శాఖ లెక్కలు చెబుతోంది. అయితే క్షేత్రస్థాయిలో వ్యవసాయ సహాయకులు నిర్లక్ష్యం కారణంగా నత్తనడకన సాగుతోందని రైతులు అభిప్రాయపడుతున్నారు. ఇదిలా ఉండగా ఈ క్రాప్ నమోదు ప్రక్రియ జాప్యానికి పలు కారణాలను చెబుతున్నారు.

వివిధ కార్యక్రమాల్లో భాగస్వామ్యం వల్లే..

గ్రామ వ్యవసాయ సహాయకులను సచివాలయ పరిధిలో జరిగే వివిధ కార్యక్రమాల్లో భాగస్వాములు చేయడం వల్ల ఈ క్రాప్ నమోదు జాప్యం జరుగుతోందని వారు చెబుతున్నారు. సర్వేలు, పింఛన్లు, ఎరువుల పంపిణీ తదితర కార్యక్రమాలు ఈ సిబ్బందితో చేపడుతున్నారన్న వాదనలు వినిపిస్తున్నాయి. గడిచిన నెల రోజులుగా వర్షాలు కురువడం, యూరియా కొరతపై సిబ్బంది దృష్టి పెట్టడంతో ఈ ప్రక్రియ మందగించిందని ఒక కారణంగా చెప్పుకోవచ్చు. అలాగే గత ప్రభుత్వం చేపట్టిన రీసర్వే వల్ల కూడా సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. వెబ్‌ల్యాండ్‌లో వివరాలు సక్రమంగా లేకపోవడంతో ఈ-క్రాప్ నమోదు కావడం లేదని సిబ్బంది చెబుతున్నారు.


వరి పంట పొలం

నెలాఖరుకు పూర్తి చేస్తాం



మండలంలో 7300 ఎకరాల్లో ఈ-క్రాప్ నమోదు పూర్తయింది. ఈ నెలాఖరు నాటికి లక్ష్యం సాధిస్తాం. వీఏఏలు ఈ-క్రాప్ నమోదు చేస్తున్నారు. ఈ క్రాప్‌లో ప్రతి ఏటా మండలం ముందంజలో ఉండేది. అయితే కొన్ని సాంకేతిక కారణాల వల్ల ఈ ఏడాది కొంత జాప్యం జరిగింది.

-దుంపల పద్మావతి, వ్యవసాయాధికారి, గార

ఘనంగా హిందీ దివస్

హిందీ దివస్ వేడుకలు ముందస్తుగా పలు పాఠశాలల్లో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినీ విద్యార్థులు పలు ప్రదర్శనలు చేశారు. వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులు అందించారు.

-ఆంధ్రజ్యోతి బృందం



సంతబొమ్మాళి: భావనపాడు, కాశీబుగ్గ: చినబడాం పాఠశాలల్లో విద్యార్థుల ప్రదర్శన


పోలాకి: పిరువాడ ఉన్నత పాఠశాలలో..


ఎన్ఎన్‌పేట: కోవిలాం పాఠశాలలో బహుమతి అందజేస్తున్న ఎంఈవో-2 చంద్రమౌళి


కవిటి: హిందీ అక్షరాల ఆకారంలో..

రోడ్ల నిర్మాణంతో అభివృద్ధి

● ఎమ్మెల్యే రవికుమార్


శిలాఫలకం ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే రవికుమార్

పొందూరు, సెప్టెంబరు 13 (ఆంధ్ర జ్యోతి): రోడ్ల నిర్మాణంతో రాష్ట్రాభివృద్ధి సాధ్యమని పీయూసీ ఛైర్మన్, ఎమ్మెల్యే కూన రకుమార్ అన్నారు. లోలుగు నుంచి వీఆర్‌గూడెంకు వరకు, రెడ్డిపేట నుంచి మూడు మర్రి చెట్ల వరకు నిర్మించిన బీటీ రోడ్లను శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం కల్పించే మౌలిక సదుపాయాల్లో రోడ్లు ముఖ్యమన్నారు. కూటమి ప్రభుత్వం రోడ్ల నిర్మాణానికి అధిక ప్రాధాన్యం ఇచ్చిందని, అటవీ ప్రాంతా ల్లోనూ రోడ్ల నిర్మాణం చేపడుతోందన్నారు. ప్రతి గ్రామంలో సీసీ రోడ్లు, కాలువల నిర్మాణం చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ అధ్యక్షుడు వండాన మురళి, తెలుగుయువత జిల్లా ప్రధాన కార్యదర్శి బలగ శంకరభాస్కర్, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు కూన సత్యనారా యణ, ఏఎంసీ మాజీ ఛైర్మన్ ఎ.రాము, ఆర్అండ్‌బీ ఎస్ఈ పి.సత్యనారాయణ, ఈఈ ఎ. తిరుపతిరావు, డీఈ గణపతిరావు, ఏఈ పీటీ రాజు, ఎంపీడీవో సింహాచలం, పలువురు టీడీపీ నేతలు పాల్గొన్నారు.

ఆలయాల అభివృద్ధికి కృషి

● ఎమ్మెల్యే శంకర్


నారాయణ తిరుమల పాలకవర్గ సభ్యులతో ఎమ్మెల్యే గొండు శంకర్

శ్రీకాకుళం కల్చరల్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఆలయాల అభి వృద్ధికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. నగరంలోని పీఎన్ కాలనీ నారాయణ తిరుమల వేంకటేశ్వరస్వామి ఆలయ పాలక మండలి ప్రమాణ స్వీకారం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత ఐదేళ్ల పాలకమండళ్ల నియామకాలు లోపభూయిష్టంగా జరిగాయన్నారు. ఈనేపథ్యంలో ఆలయాల అభివృద్ధికి పాటుపడతామన్న వారినే సభ్యులుగా నియమించామన్నారు. నారాయణ తిరుమల ఆలయ శాశ్వత ఛైర్మన్, విశ్రాంత న్యాయ మూర్తి జస్టిస్ గురుగుబెల్లి యతిరాజులు మాట్లా డుతూ.. ఆలయానికి సమీపంలో పుష్కరిణి నిర్మించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని, ఆలయాభివృద్ధికి కమిటీ సభ్యులు కృషి చేయాలన్నారు. పాలక మండలి శాశ్వత ఛైర్మన్‌గా జస్టిస్ యతి రాజులు, సభ్యులుగా మద్ది భాను మతి, కె.శ్రీనివాసరావు, ఎ.గోవింద రావు, శిల్లా రాధిక, జె.అరుణ, కె.నాగరాజు, బి.సాయమ్మలతో ఎమ్మెల్యే ప్రమాణ స్వీకారం చేయిం చారు. కార్యక్రమంలో ఆలయ అధికారులు, అర్చకులు, కూటమి నేతలు పాల్గొన్నారు.

జీఎస్టీ తగ్గింపు దేశ ప్రజలకు గొప్ప కానుక


ప్రధాని మోదీ చిత్రపటానికి పాలభిషేకం చేస్తున్న బీజేపీ నేతలు

శ్రీకాకుళం రూరల్, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): జీఎస్టీ తగ్గింపుతో దేశ ప్రజలకు ఎంతో ఊరట కలిగించిందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు సిరిపురం తేజేశ్వరరావు అన్నారు. ఈ మేరకు శనివారం అరసవల్లి మిల్లు జంక్షన్‌లో బీజేపీ మహిళా మోర్చా రాష్ట్ర నాయకురాలు శవ్వాన ఉమా మహేశ్వరి ఆధ్వర్యంలో ప్రధాని మోదీ, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ కటౌట్లకు క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎర్రకోటపై ప్రధాని మోదీ ఇచ్చిన హామీని నిలబెట్టుకున్నారన్నారు. కోట్లాది మంది మధ్య తరగతి ప్రజలకు దసరా, దీపావళి కానుక అందజేశారని కొనియాడారు. కార్యక్రమంలో బీజేపీ నేతలు పైడి సింధూర, సూర్యకుమారి తదితరులు పాల్గొన్నారు.

మెనూ పాటించకుంటే ఫిర్యాదు

పొందూరు, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): పాఠశాలల్లో విద్యాప్రమాణాలకు అనుగుణంగా బోధన జరగకున్నా, మెనూ సక్రమంగా అమలు చేయకున్నా ధైర్యంగా అధికారులకు ఫిర్యాదు చేయాలని ఎస్ఎస్ఏ ఏపీసీ ఎస్.శశిభూషణరావు అన్నారు. లోలుగు కేజీబీవీని శనివారం సందర్శించారు. విద్యాబోధన, మెనూను విద్యార్థినులను అడిగి తెలుసుకున్నారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆలయాల వల్లే ఆధ్యాత్మికత

శ్రీకాకుళం కల్చరల్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): మానసిక ఒత్తిడి నివారణతో పాటు ఆధ్యాత్మికత కేవలం ఆలయాల వల్లే సాధ్యమని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. విశాఖ-ఎ కాలనీలో కాలనీ వాసులతో శనివారం సమావేశం నిర్వహించారు. నీలమణి దుర్గాదేవి ఆలయం నిర్మాణానికి దాతలు సహకరించాలని కోరారు. ఆలయ అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు. ఈ సందర్భంగా విరాళాలు ఇచ్చిన పలువురు దాతలను అభినందించారు. కార్యక్రమంలో నగర టీడీపీ నాయకులు పాండ్రంకి శంకర్, శింతు సుధాకర్‌రావు, అందవరపు సంతోష్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పీఎంపీలకు ప్రథమ చికిత్సపై అవగాహన


సీపీఆర్‌పై అవగాహన కల్పిస్తున్న డాక్టర్ అన్నెపు శశిధర్

అరసవిల్లి, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): వరల్డ్ ఫస్ట్ ఎయిడ్ దినోత్సవం సందర్భంగా కమ్యూనిటీ పారా మెడికల్స్ అండ్ ప్రైమరీ హెల్త్‌కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ (డీపీఎంపీ అసోసియేషన్), డాక్టర్ శశిధర్ హాస్పిటల్, శ్రీకాకుళం ఆధ్వర్యంలో పీఎంపీలకు ప్రథమ చికిత్స, సీజనల్ వ్యాధులపై శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. డాక్టర్ శశిధర్ మాట్లాడుతూ.. పాముకాటు, ఫిట్స్, హార్ట్ ఎటాక్, బ్రెయిన్ స్ట్రోక్, సీజనల్ జ్వరాల్లో రకాలు, ప్రథమ చికిత్స తదితర అంశాలపై అవగాహన కల్పించారు. సీపీఆర్ చేసే విధానాన్ని వివరించారు. ఎముకల వైద్య నిపుణుడు డాక్టర్ కె.కిషోర్ ఎముకలు విరిగితే ఎలా గుర్తించాలి, ప్రథమ చికిత్స చేసే విధానాలను వివరించారు. శస్త్ర చికిత్స నిపుణుడు డా.సీహెచ్.గోవిందరావు ఎటువంటి గాయాలైనా, ఎపెండిక్స్ వంటి అత్యవసర కేసులను గుర్తించే విధానాలను వివరించారు. డాక్టర్ అన్నెపు శశిధర్‌ను సంఘ సభ్యులు సత్కరించారు. కార్యక్రమంలో సం ఘం జిల్లా అధ్యక్షుడు వండాన శిమ్మన్న, కార్యదర్శి నక్క లక్ష్మీనారాయణ, కోశాధికారి జనార్ధనరావు, చిన్నాల రాము తదితరులు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

డ్రోన్‌తో ఎరువుల పిచికారీ

జి.సిగడాం, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): ధవలపేటకు చెందిన రైతు కంచరాన సూరన్నా యుడు వరి పంట పొలంలో శనివారం సేంద్రియ ఎరువులను డ్రోన్‌తో పిచికారీ చేశారు. ఈ ప్రక్రియను స్థానిక రైతులు ఆసక్తిగా తిలకించారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ సూరన్నా యుడు మాట్లాడుతూ.. భూసారం పెంచేందుకు వరి సాగులో జిల్లేడు, జీవామృతం వాడాలన్నారు. రసాయకనిక ఎరువులు వాడకం తగ్గించి సేంద్రియ ఎరువుల వాడకంపై దృష్టి సారించా లన్నారు.

డీలర్లకు కొత్త డివైజర్లు

కంచిలి, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని నాలుగు మండలాలకు చెందిన 192 మంది రేషన్ డీలర్లకు కొత్త డివైజర్లను కంచిలి సివిల్ సప్లై గోడౌన్ సమీపంలో శనివారం సీఎస్‌డీటీ కూర్మారావు అందజేశారు. కొత్త స్మార్ట్ కార్డులు పంపిణీ చేసిన నేపథ్యంలో కొత్త మిషన్‌లు అందజేస్తున్నట్లు ఆయన తెలిపారు.

ఇస్కాఫ్ కార్యవర్గం ఎన్నిక

శ్రీకాకుళం కల్చరల్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): భారత సాంస్కృతిక సహకార స్నేహ సంఘం (ఇస్కాఫ్) జిల్లా నూతన కార్యవర్గాన్ని శనివారం ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షుడిగా బుడుమూరు శ్రీరామమూర్తి, గౌరవ సలహాదారుగా గేదెల ఇందిరా ప్రసాద్‌లు ఎన్నికయ్యారు. అలాగే జిల్లా అధ్యక్షుడిగా బుడుమూరు వెంకట సూర్యనారాయణ రాజు, ప్రధాన కార్యదర్శిగా జీవీ నాగభూషణరావు, కార్యదర్శిగా గురుగుబెల్లి రాజేశ్వరరావు, ఉపాధ్యక్షులుగా సీపాన రామారావు, టి.కామేశ్వరి, సనపల నారాయణరావు, సాహుకారి నాగేశ్వరరావులతో పాటు సభ్యులను ఎన్నుకున్నారు.

ప్రమాదకరంగా విద్యుత్ స్తంభం


గట్టుపై ఒరిగిపోయిన స్తంభం

రణస్థలం, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): వేల్పురాయి గ్రామ సమీపంలో కారి చెరువు పొలం గట్టుపై విద్యుత్ స్తంభం ఇటీవల వర్షాలకు పూర్తిగా ఒరిగిపోయి ప్రమాదకరంగా ఉంది. నిత్యం రైతులు ఈ ప్రాంతంలో పనుల నిమిత్తం రాకపోకలు సాగిస్తుంటారు. ప్రమాదం జరగకముందే సంబంధిత అధికారులు స్పందించి స్తంభాన్ని సరిచేయాలని అనేక పర్యాయాలు కోరినా పట్టించు కోవడం లేదని వాపోయారు. ఇప్పటికైనా తగు చర్యలు తీసుకోవాలని పలువురు గ్రామ రైతులు కోరుతున్నారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

లావేరు, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): బొంతుపేట శ్మశాన వాటిక వెనుక ఉన్న పంట పొలాల్లో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైనట్లు పోలీసులు తెలిపారు. వారు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. సుమారు 60 నుంచి 65 ఏళ్ల వయసున్న వ్యక్తి మృతదేహాన్ని అటుగా పంట పొలాలకు వెళుతున్న స్థానికులు శనివారం గుర్తించారు. వెంటనే వారు పోలీసులకు సమాచా రమిచ్చారు. ఇతని ఒంటిపై తెలుపు రంగు ఫుల్ హ్యాండ్ బనియన్, ఆ పక్కనే చేతి కర్ర ఉంది. ఈ మృతదేహానికి సంబంధించి వివరాలు తెలిస్తే 6309990851 నెంబరుకు తెలియజేయాలని పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ జి.లక్ష్మణరావు తెలిపారు.

ఒడిశా టు తమిళనాడు

- 5 కేజీల గంజాయితో ముగ్గురి అరెస్టు


మాట్లాడుతున్న డీఎస్పీ వెంకట అప్పారావు

ఇచ్ఛాపురం, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): ఒడిశాలో కొనుగోలు చేసిన గంజాయిని ఇచ్ఛాపురం రైలు మార్గం ద్వారా తమిళనాడుకు తరలించేందుకు సిద్ధమైన తమిళనాడు రాష్ట్రానికి చెందిన ముగ్గురిని అరెస్ట్ చేసినట్లు డీఎస్పీ వెంకట అప్పారావు తెలిపారు. శనివారం సర్కిల్ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ వివరాలు వెల్లడించారు. ఆ వివరాలిలా ఉన్నాయి.. తమిళనాడు రాష్ట్రం కోయంబత్తూరు, తిరుప్పూరు జిల్లాలకు చెందిన ముత్తుకుమార్, ఉదయ్ కుమార్, ముత్తురామలింగం ఒడిశా రాష్ట్రం మోహన్ ఏరియాలో కొనుగోలు చేసిన 5 కేజీల గంజాయితో బస్సులో ఇచ్ఛాపురం వచ్చి తమిళనాడుకు వెళ్లేందుకు రైల్వేస్టేషన్‌కు చేరుకున్నారు. గంజాయి తరలిస్తున్నట్లు పట్టణ ఎస్ఐ ముకుందరావుకు సమాచారం రావడంతో రైల్వే స్టేషన్‌కు వెళ్లి అనుమానస్పదంగా కనిపించిన వీరు ముగ్గురి వద్ద తనిఖీ చేపట్టారు. 5 కేజీల గంజాయిని గుర్తించి సీజ్ చేసి నిందితులను అరెస్టుచేసి రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ తెలిపారు. నిందుతులు గంజాయి తాగేందుకు అలవాటు పడి వారి జల్సాల కోసం తమిళనాడు రాష్ట్రం తిరుప్పూరు జిల్లాకు చెందిన గంజాయి వ్యాపారి పాండ్యరాజు వద్ద గంజాయినికొని తాగేవారు. గంజాయి అమ్మే కొయింబత్తూరు జిల్లాకు చెందిన కుమార్ (అత్తవారి గ్రామం ఒడిశా రాష్ట్రం మోహన్ ఏరియా) వెళ్లి అతని వద్ద 5 కేజీల గంజాయిని కొని తీసుకొస్తే ఒకొక్కరికి రూ.1000 చొప్పున నగదుతో పాటు తాగటానికి గంజాయిని ఇస్తానని చెప్పడంతో ఈ ముగ్గురు అంగీకరించారు. తమిళనాడు నుంచి ఒడిశా చేరుకుని అక్కడ కొనుగోలు చేసిన గంజాయితో ఇచ్ఛాపురం వస్తుండగా రైల్వే స్టేషన్‌లో పట్టుకున్నామని డీఎస్పీ తెలిపారు. కార్యక్రమంలో సీఐ మీసాల చిన్నమనాయుడు, పట్టణ ఎస్ఐ ముకుందరావు, సిబ్బంది పాల్గొన్నారు.

టమోటా లారీ బోల్తా

పలాసరూరల్, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): నీలావతి గేటు వద్ద అమరావతి హోటల్ సమీపంలో జాతీయ రహదారిపై టమోటా లోడుతో ఒడిశా వైపు వెళ్తున్న లారీ ప్రమాదవశాత్తు బోల్తాపడింది. దీంతో టమోటా బుట్టలన్నీ చెల్లా చెదురు కాగా, స్థానికులు వాటిని రోడ్డుపై నుంచి పక్కకు తప్పించారు. ఈ ప్రమాదంలో ఎవరికి ఏమీ జరగకపోవడంతో అంతా ఊపిరిపీల్చుకున్నారు. ఈ సంఘటనపై కాశీబుగ్గ ఎస్ఐ నర్సింహమూర్తి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఉనికి కోసమే విమర్శలు

పాతపట్నం, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి తన ఉనికిని చాటుకొనేందుకే ప్రభుత్వంపై విమర్శలకు దిగుతున్నారని మెళియాపుట్టి పీఏసీఎస్ అధ్యక్షుడు సలాన మోహనరావు అన్నారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మురికింటిభద్ర స్కూల్ భవనం పెచ్చులూడుతున్నాయంటూ శాంతి చేసిన ఆరోపణలను ఖండించారు. వైసీపీ పాలనలో ఏరోజైనా ప్రజాక్షేత్రంలో సమస్యలను గుర్తించారా? అని ప్రశ్నించారు. ఈ సమావేశంలో రాష్ట్ర గౌడ కార్పొరేషన్ డైరెక్టర్ భాస్కరగౌడ, టీడీపీ నేతలు నంబాల వెంకటరావు, భైరిసింగి దినకరరావు, కదంబల పైడిరాజు తదితరులు పాల్గొన్నారు.

ఉద్దాన ప్రాంతాన్ని అభివృద్ధి చేయాలి


రౌండ్ టేబుల్ సమావేశంలో నాయకులు

కాశీబుగ్గ, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఉద్దానంలోని ప్రకృతి వనరులను సద్వినియోగం చేసుకుంటూ ఆ ప్రాంతాన్ని అభివృద్ధి చేయాలని ఉత్త రాంధ్ర అభివృద్ధి వేదిక ప్రధాన కార్యదర్శి ఎ.అజయ్‌శర్మ అన్నారు. శనివారం కాశీబుగ్గలో జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. 'జీడికి గిట్టుబాటు ధర కల్పించాలి. 80కేజీల బస్తా రూ.16వేలకు రైతు సేవా కేంద్రాల ద్వారా ప్రభుత్వమే కొనుగోలు చేయాలి. ప్రభుత్వం ఇచ్చిన హామీలో భాగంగా ఉద్దాన ప్రాంతంలో జీడి బోర్డుతో పాటు జీడి,కొబ్బరి,నార సహకార పరిశ్రమలు ఏర్పాటు చేసి ఉపాధి అవకాశాలు కల్పించాలి. కిడ్నీ వ్యాధి నిర్మూలనకు పూర్తిస్థాయిలో చర్యలు చేపట్టాలి. ఆఫ్‌షోర్ రిజర్వాయర్ పూర్తిచేయాలి. నైపుణ్యాభివృద్ధి, సైనిక శిక్షణ కేంద్రాలు ఏర్పాటు చేయాలి.' అని ఆయన డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ప్రజా సంఘాల నాయకులు జుత్తు సింహాచలం, అప్పారావు,. ధర్మారావు, ఖగేశ్వరరావు, అజయ్, హేమారావు, గోపాలకృష్ణ, గీతమ్మ, వాసు తదితరులు పాల్గొన్నారు.

వేతనం చెల్లించాలి

జలుమూరు, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): సమగ్ర శిక్ష ప్రాజెక్టు పరిధిలో పనిచేస్తున్న కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్, పార్ట్‌టైం ఉద్యోగులకు తక్షణమే వేతనం చెల్లించాలని సీఆర్ఎంటీ సంఘం మండల కన్వీనర్ పట్ట వైకుంఠరావు డిమాండ్ చేశారు. స్థానిక ఎంఆర్‌సీ కార్యాలయం వద్ద శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. గత నెలకు సంబంధించిన వేతనం ఇంతవరకు ఇవ్వకపోవడంతో కుటుంబ పోషణకు అవస్థలు పడుతున్నామన్నారు. వెంటనే వేతనం చెల్లించాలని ప్రభుత్వాన్ని కోరారు.

బకాయిలు విడుదల చేయాలి

వజ్రపుకొత్తూరు, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): డీఏ, పీఆర్సీ, ఐఆర్ బకాయిలను వెంటనే చెల్లించాలని యూటీఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. ఒంకులూరు హైస్కూల్‌లో యూటీఎఫ్ మండల అధ్యక్షుడు చొక్కర ధర్మారావు ఆధ్వర్యంలో శనివారం సమావేశం నిర్వహించారు. సోమవారం బైక్‌ర్యాలీ చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. సమావేశంలో జిల్లా కౌన్సిలర్ బల్ల చిట్టిబాబు పాల్గొన్నారు.

సీతారాం ఏచూరికి నివాళి

కొత్తూరు, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): సీపీఎం నేత కామ్రేడ్ సీతారాం ఏచూరి ప్రథమ వర్ధంతిని కొత్తూరులో శనివారం సీపీఎం నాయకులు ఘనంగా నిర్వహించారు. సీతారాం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు సిర్ల ప్రసాద్, నాయకులు నిమ్మక అప్పన్న, టి.తెల్లన్న, రాములు, దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

రాజీయే రాజమార్గం

- జాతీయ లోక్ అదాలత్‌లో న్యాయాధికారులు
- ఎనిమిది కోర్టుల్లో 1104 కేసుల పరిష్కారం

కేసుల పరిష్కారానికి రాజీయే రాజమార్గమని వివిధ కోర్టుల న్యాయాధికారులు తెలిపారు. శనివారం జాతీయ లోక్ అదాలత్ నిర్వహించి 1104 కేసులను పరిష్కరించారు. ఇందులో సివిల్, క్రిమినల్, ఎక్సైజ్, మనోవర్తి తదితర కేసులు ఉన్నాయి. రాజీ పడడం వల్ల ఇరు వర్గాలూ గెలిచినట్లేనని వారు చెప్పారు.



ఇచ్ఛాపురం: మాట్లాడుతున్న న్యాయాధికారి ఫరీష్‌కుమార్

ఇచ్ఛాపురంలో 200 కేసులు..

ఇచ్ఛాపురం, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): స్థానిక మున్సిఫ్ మెజిస్ట్రేట్ కోర్టులో నిర్వహించిన లోక్ అదాలత్‌లో 200 కేసులను రాజీ చేసినట్లు జూనియర్ సివిల్ న్యాయాధికారి పి.ఫరీష్‌కుమార్ తెలిపారు. ఈ కేసుల ద్వారా రూ8.77లక్షలు వసూలు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో డీఎస్పీ వెంకట అప్పారావు న్యాయవాదులు బైరాగిరెడ్డి, రమణయ్యరెడ్డి, నాగరాజుపాత్రో, ప్రేమలత తదితరులు పాల్గొన్నారు.

నరసన్నపేటలో 111..



నరసన్నపేట: అదాలత్ నిర్వహిస్తున్న సివిల్ న్యాయాధికారి వాణి

నరసన్నపేట, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): స్థానిక సివిల్ కోర్టు ఆవరణలో లోక్ అదాలత్ నిర్వహించారు. 111 కేసులు పరిష్కారమైనట్లు జూనియర్ సివిల్ న్యాయాధికారి ఎస్.వాణి తెలిపారు. కార్యక్రమంలో పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు.

పలాసలో 225..


పలాస: జూనియర్ సివిల్ న్యాయాధికారి మాధురి ఆధ్వర్యంలో..

పలాస, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): స్థానిక మున్సిఫ్ మెజిస్ట్రేట్ కోర్టులో జరిగిన లోక్‌అదాలత్‌లో 225 పరిష్కారమైనట్లు జూనియర్ సివిల్ న్యాయాధికారి యు.మాధురి తెలిపారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మహ్మద్ పయ్యాజ్ అహ్మద్, ఉపాధ్యక్షుడు బికెఆర్.పట్నాయక్, సీనియర్ న్యాయవాదులు పైల రాజరత్నంనాయుడు, ఎస్.వెంకటరమణ, తాండ్ర మురళీమోహన్, డీఎస్పీ వి.వెంకటఅప్పారావు, సీఐలు పి.సూర్యనారాయణ, తిరుపతిరావు పాల్గొన్నారు.

పొందూరులో 206..

పొందూరు, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): పొందూరు కోర్టులో న్యాయాధికారి బి.జ్యోత్స్న ఆధ్వర్యంలో నిర్వహించిన లోక్ అదాలత్‌లో 206 వివిధ కేసులను పరిష్కరించారు. తద్వారా సివిల్ కేసుల కక్షిదారులకు రూ.50.60 లక్షలు లబ్ధి చేకూరింది. ప్రభుత్వానికి రూ.15.57 లక్షల ఆదాయం వచ్చిందన్నారు. న్యాయవాదులు కె.మంజుల, పి.రామ్మోహన్, బ్రహ్మజీ, ఎం.రాము, కిరణ్, అప్పలనాయుడు పాల్గొన్నారు.

పాతపట్నంలో 69..

పాతపట్నం, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): పాతపట్నం జూనియర్ సివిల్ కోర్టులో జరిగిన లోక్‌అదాలత్‌లో 69 కేసులు పరిష్కరించినట్లు జిల్లా ప్రిన్సిపల్ సివిల్ న్యాయాధికారి ఎం.శ్రీధర్ తెలిపారు. ఆయా కేసుల్లో రూ.2,71,240 అపరాధ రుసుం విధించారు. న్యాయవాదులు, వివిధశాఖల అధికారులు, కక్షిదారులు పాల్గొన్నారు.


పాతపట్నం: జాతీయ లోక్‌అదాలత్ నిర్వహిస్తున్న జిల్లా ప్రిన్సిపల్ సివిల్ న్యాయాధికారి శ్రీధర్

సోంపేటలో 61..

సోంపేట, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): స్థానిక కోర్టులో జాతీయ లోక్‌అదాలత్ ద్వారా 61 కేసులు రాజీ చేసినట్లు సీనియర్ సివిల్ న్యాయాధికారి జె.శ్రీనివాసరావు, ఒకటో బెంచ్, జూనియర్ సివిల్ న్యాయాధికారి కె.శ్రీనివాసరావు తెలిపారు. వీటిలో క్రిమినల్ 24, మనోవర్తి 1, సివిల్ దావాలు 8తో పాటు 28 ఎక్సైజ్ కేసులు ఉన్నాయి. కార్యక్రమంలో కాశీబుగ్గ డీఎస్పీ వెంకట అప్పారావు, న్యాయవాదులు పాల్గొన్నారు.

కోటబొమ్మాళిలో 147..

కోటబొమ్మాళి, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): స్థానిక జూనియర్ సివిల్ కోర్టులో నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో 147 కేసులు పరిష్కారమయ్యాయి. ఇందులో సివిల్ కేసులు 3, క్రిమినల్ 22, ఎక్సైజ్ ఒకటి, ప్లీబార్గయినింగ్ ద్వారా రాజీ అయిన కేసులు 80, అడ్మిషన్ 39, మనోవర్తి రెండు కేసులు ఉన్నాయి. జూనియర్ సివిల్ న్యాయాధికారి ఎస్.వాణి, న్యాయవాదులు జీవన్, తిరుమలరావు, న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు ఎల్. శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

టెక్కలిలో 85..

టెక్కలి సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): టెక్కలి కోర్టుల సముదాయంలో జరిగిన లోక్ అదాలత్‌లో 85 కేసులు పరిష్కారమైనట్లు సీనియర్ సివిల్ న్యాయాధికారి బి.నిర్మల, ఫుల్ అడిషనల్ జూనియర్ సివిల్ న్యాయాధికారి యు.మాధురి తెలిపారు. సివిల్ కేసులు 4, క్రిమినల్ 45, ఎక్సైజ్ 29, ఇతర కేసులు 7 పరిష్కరించి రూ9,10,100 అపరాధ రుసుం విధించారు. కార్యక్రమంలో అదాలత్ సభ్యులు పి.చంద్రుడు, ఐ.మల్లేసు, బి.శ్రీనివాసరావు, టెక్కలి న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు పినకాన అజయ్‌కుమార్, న్యాయవాదులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.


టెక్కలి: అదాలత్‌లో పాల్గొన్న న్యాయాధికారి, న్యాయవాదులు

యూరియా కోసం పాట్లు

- మండుటెండలో బారులుతీరుతున్న రైతులు
- పలుచోట్ల నిరసనలు, తోపులాటలు

ఎరువుల కోసం రైతులు పాట్లు పడుతున్నారు. యూరియా దొరక్క తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వాటికోసం ఎరువుల దుకాణాల వద్ద మండుటెండలో బారులు తీరుతున్నారు. పలుచోట్ల తోపులాటలు చోటుచేసుకుంటున్నాయి. సక్రమంగా పంపిణీ చేయడం లేదంటూ రైతులు నిరసనలు, ఆందోళనలు చేపడుతున్నారు. యూరియా, డీఏపీ, గ్రోమోర్ కోసం చాలా ఇబ్బందులు పడుతున్నామని రైతులు అంటున్నారు. యూరియా ఉంచుకునే వ్యాపారులు ఇవ్వడం లేదని అంటున్నారు.
యూరియా కోసం రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, కావాల్సిన ఎరువులు ఉన్నాయని అధికారులు చెబుతున్నారు.

-ఆంధ్రజ్యోతి బృందం


సంతబొమ్మాళి: బోరుభద్రలో మండుటెండలో బారులు తీరిన రైతులు


కోటబొమ్మాళి: ఆందోళన చేస్తున్న రైతులకు సర్దిచెబుతున్న పోలీసు


పాతపట్నం:తెంబూరు ఆర్ఎస్‌కే ముందు బారులుతీరిన రైతాంగం


జలుమూరు: చల్లవానిపేటలోని ఓ దుకాణం వద్ద ..

వైసీపీ నేతల అత్యుత్సాహం

- ఇద్దరి మధ్య తగాదాను ఎరువుల కోసం గొడవగా చిత్రీకరణ
- సోషల్ మీడియాలో పోస్టు ●ఖండించిన టీడీపీ నాయకులు

సంతబొమ్మాళి, సెప్టెంబరు13 (ఆంధ్రజ్యోతి): ఆకాశలక్కవరంలో శనివారం ఇద్దరి రైతుల మధ్య జరిగిన తగాదాను, ఎరువుల కోసం గొడవంటూ వైసీపీ నాయకులు సోషల్ మీడియాలో పోస్టింగ్‌లు పెట్టి అత్యుత్సాహం ప్రదర్శించారు. భూహద్దులకు సంబంధించి గ్రామానికి చెందిన ఇద్దరి రైతుల మధ్య తగాదా జరిగింది. అది చిన్నపాటి కొట్లాటకు దారితీసింది. దీంతో సంఘటనా స్థలానికి నౌపడ పోలీసులు చేరుకొని ఇరువర్గాలకు సర్దిచెప్పి పంపించి వేశారు. అయితే ఆకాశలక్కవరానికి చెందిన వైసీపీ రాష్ట్ర రైతు విభాగం కార్యదర్శి సుగ్గు రామిరెడ్డి ఈ గొడవను ఎరువుల తగాదాగా మార్చి సోషల్ మీడియాలో పోస్టులు పెట్టారు. ఎరువులకు సంబంధించిన క్యూపన్లు టీడీపీ వారికే అందజేస్తున్నారని, దీంతో రైతులకు ఎరువులు అందడం లేదని, వారిమధ్య గొడవ చోటు చేసుకుందని సోషల్ మీడియా వీడియో పెట్టారు. దీన్ని ఖండిస్తూ టీడీపీ నాయకులు ప్రకటన విడుదల చేశారు. ఇటువంటి తప్పుడు ప్రచారాలు మానుకోవాలని ఆకాశలక్కవరం గ్రామ కమిటీ అధ్యక్షుడు సుగ్గు అప్పలరెడ్డి అన్నారు.

ప్రతి ఇంటికీ సురక్షిత నీరు


ఉద్దానం ప్రాజెక్టు-ఫేజ్ 2 పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గోవిందరావు

హిరమండలం, సెప్టెంబరు13(ఆంధ్రజ్యోతి): పాతపట్నం నియోజకవర్గంలో ప్రతి ఇంటికీ సురక్షిత తాగునీరు చేరేలా ప్రణాళిక తయారు చేసినట్లు ఎమ్మెల్యే మామిడి గోవిందరావు తెలిపారు. ఉద్దానం ప్రాజెక్టు-ఫేజ్ 2లో భాగంగా సుభలయ గ్రామం వద్ద 18 ఎంఎల్‌డీ వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ పనులను ఆయన శనివారం ప్రారంభించారు. నియోజకవర్గం ప్రజలకు శుద్ధజాలలు అందించేందుకు ఈ ప్రాజెక్టు కీలకమని అన్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ మాట్లాడుతూ.. హిరమండలం, కొత్తూరు, ఎల్.ఎన్.పేట మండలాల్లోని 204 గ్రామాలకు శుద్ధ జలం అందించేందుకు రూ.253 కోట్లతో 18ఎంఎల్‌డీ వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్‌ను నిర్మిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యుడు పి.బుచ్చిబాబు, సర్పంచ్ లంక రోజారాణి, ఎంపీటీసీ చింతాడ బుడ్డు, పీఏసీఎస్ అధ్యక్షుడు గోళ్ల సింహాచలం, మండల ప్రత్యేక ఆహ్వానితులు తూలుగు తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

పేద విద్యార్థికి ఆర్థిక సహాయం



విద్యార్థికి నగదు అందిస్తున్న లైన్స్‌క్లబ్ సభ్యులు

కాశీబుగ్గ, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి):పలాస కాశీబుగ్గ లైన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో లైన్ డోకి రామారావు శనివారం కాశీబుగ్గ శ్రీచైతన్య జూనియర్ కళాశాలలో ఇంటర్ చదువుతున్న సకల భక్తుల కార్తిక అనే పేద విద్యార్థికి రూ.5వేలు ఆర్థిక సహాయం చేశారు. కార్యక్రమంలో లైన్స్ క్లబ్ అధ్యక్షుడు సింద్రీ మధు, సభ్యులు అప్పారావు, వైహెచ్ దొర, కేవీ రామన్న పాల్గొన్నారు.

సేవా పక్షోత్సవాలు విజయవంతం చేయండి

నరసన్నపేట, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి) దేశ వ్యాప్తంగా ఈనెల 17 నుంచి అక్టోబరు 2 వరకు బీజేపీ ఆధ్వర్యంలో జరగనున్న సేవా పక్షోత్సవాల్లో కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని ఆ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి చింతు పాపారావు కోరారు. స్థానిక సంతపేటలోని ఓ కల్యాణ మండపం ఆవరణలో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 15 రోజుల పాటు బీజేపీ కార్యకర్తలు పేదలకు సేవలు అందించాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో మండల సేవా పక్షోత్సవాల కమిటీ ప్రతినిధులు ఏపీ మహరాన, కిల్లి లక్ష్మణరావు, కె.శ్రీనివాసరావు, డి.రాజకుమార్, సీపాన కృష్ణారావు, శకుంత, ఉషారాణి తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ కార్యవర్గం ఎన్నిక

నందిగాం,సెప్టెంబరు13(ఆంధ్రజ్యోతి): భారతీయ జనతా పార్టీ మండల కార్యవర్గాన్ని శనివారం ఎన్నుకున్నారు. దేవుపురంలో ఈ కార్యక్రమం జరిగింది. పార్టీ మండల అధ్యక్షునిగా ఏడూరు కామరాజు, ఉపాధ్యక్షులుగా కొండల జగన్నాథం, బొండాటి మాధవరావు, బగాది మన్మథరావు, అట్టాడ కిషోర్‌కుమార్, కొండాల జ్యోతి, ప్రధాన కార్యదర్శులుగా రామకృష్ణ, కురమాన మురళీ, కార్యదర్శులుగా యజ్జ వెంకటరావు, బమ్మిడి రామమూర్తి, రాజాం సురేష్‌కుమార్‌ను ఎన్నుకున్నారు.

వెలుగు ఏపీఎం తీరుపై నిరసన

కొత్తూరు, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): మండల మహిళా సమైఖ్య ఏపీఎం లలితకుమారి తీరుపై మహిళా సంఘ సభ్యులు నిరసన తెలిపారు. ఈ మేరకు శనివారం మండల పరిషత్ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా మండల మహిళా సంఘం అధ్యక్షురాలు రవ్వల జయమ్మ మాట్లాడుతూ.. ఏపీఎం బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తున్నారని అన్నారు. సమావేశాల్లో తమను పరుష పదాలతో కించపరుస్తుంటారన్నారు. ఆమెకు నచ్చిన వారి తీర్మానాలను మినిట్ బుక్స్‌లో నమోదు చేస్తున్నారని ఆరోపించారు. ఎవరైనా అడిగితే కక్ష సాధింపు చర్యలు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఏపీఎంపై కలెక్టర్‌కు, డీఆర్‌డీఏ పీడీకీ మెయిల్ ద్వారా ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఆమెపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మహిళలు పి.శ్రావణి, బి.నాగమ్మ, పి.పార్వతి, పి.సింహాద్రమ్మ, బి.భారతి, ఎస్.శిరీష తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య పనుల పరిశీలన

కోటబొమ్మాళి, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): కొత్తమ్మతల్లి జాతరకు సంబంధించి కోటబొమ్మాళిలో జరుగుతున్న పారిశుధ్య పనులను టెక్కలి డీఎల్‌పీవో ఐవీ.రమణ శనివారం పరిశీలించారు. పంచాయతీ ఈవో చింతాడ సన్యాసిరావు పాల్గొన్నారు.

ఆసుపత్రి నిర్మాణానికి సహకారం అందిస్తాం

పలాస, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం స్థలం అందిస్తే తాము నేత్ర, క్యాన్సర్ ఆసుపత్రి నిర్మాణానికి సిద్ధంగా ఉన్నామని మాజీ ఎంపీ దివంగత కణితి విశ్వనాథం కుమారుడు రాజేంద్ర, కుమార్తె శారద తెలిపారు. శనివారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విశ్వనాథం విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఇప్పటికే పాఠశాలలో రూఫింగ్ వేయడానికి రూ.10 లక్షలు వెచ్చించామని, దీంతో పాటుగా తరగతి గదులన్నింటికీ సీలింగ్ ఫ్యాన్లు, ఆడిటోరియంలో స్టేజి నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకుడు పి.వైకుంఠరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థుల రక్తదానం

పలాస, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): ఇంజనీరింగ్ దినోత్సవం సందర్భంగా స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు శనివారం స్థానిక పవర్‌గ్రిడ్ కార్యాలయంలో రక్తదానం చేశారు. ప్రిన్సిపాల్ జె.వెంకటలక్ష్మి, రెడ్‌క్రాస్ సొసైటీ వైస్‌ప్రిన్సిపాల్ గణపతిరావు, రెడ్‌రిబ్బన్‌క్లబ్ కన్వీనర్ బి.నర్సింహులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థులు

కోటబొమ్మాళి, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): వచ్చే నెలలో జరగనున్న కళాఉత్సవ్-2025 రాష్ట్రస్థాయి పోటీలకు కొత్తపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన ఏడుగురు విద్యార్థులు ఎంపికయ్యారని ప్రధానోపాధ్యాయురాలు కె.శాంతకుమారి తెలిపారు. శుక్ర, శనివారాల్లో వమరవల్లి డైట్‌లో జరిగిన జిల్లా స్థాయి కళాఉత్సవ్-2025లో మూడు విభాగాల్లో పాఠశాలకు చెందిన ఎల్.నవదీప్, ఎస్. జ్ఞానశ్రీ, ఎస్.ప్రియాంక, పి.హేమని, సరిత, దివ్య, శ్రావణి ప్రథమ స్థానంలో నిలిచి రాష్ట్ర పోటీలకు అర్హత సాధించినట్లు చెప్పారు.

యువత శ్రమదానం

హరిపురం, సెప్టెంబరు13 (ఆంధ్రజ్యోతి): మందస మండలం సొండిపూడి గ్రామ యువత శనివారం శ్రమదానం చేపట్టింది. ఎంఎం రోడ్డులో గుంతలు పూడ్చి వాహనదారులకు ఇక్కట్లు తొలగించింది. కార్యక్రమంలో అంబేడ్కర్ యువజన సేవాసంఘం సభ్యులు కొత్తపల్లి విద్యాసాగర్, బొగాన ఈశ్వరరావు, బుస్కల మురళి తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక చేయూత

హరిపురం, సెప్టెంబరు13(ఆంధ్రజ్యోతి): మందస పట్టణానికి చెందిన కానిస్టేబుల్ బెహరా మురళీ కుటుంబానికి పోలీసు అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు రోణంకి కృష్ణం నాయుడు, ఎస్ఐ కె.కృష్ణప్రసాద్ రూ.లక్ష చెక్కును శనివారం అందజేశారు. ఎచ్చెర్లలోని ఏఆర్ కానిస్టేబుల్‌గా పని చేస్తున్న మురళి ఇటీవల అనారోగ్యంతో మృతిచెందారు. దీంతో ఆయన భార్య మమతారాణిని పరామర్శించి చెక్కును అందజేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు కె.భుజంగరావు, నరసింగరావు, తదితరులు పాల్గొన్నారు.

27న నృత్య పోటీలు

వజ్రపుకొత్తూరు, సెప్టెంబరు13 (ఆంధ్రజ్యోతి): డోకులపాడులో దేవి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఈ నెల 27న రాత్రి జిల్లా స్థాయి నృత్య పోటీలు నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. గ్రూప్ డ్యాన్స్, సోలో, డ్యూయెట్ విభాగాల్లో పోటీలు ఉంటాయన్నారు. విజేతలకు నగదు బహుమతులతో పాటు జ్ఞాపికలు అందించనున్నట్లు చెప్పారు. వివరాలకు వంశీ 7075595609, తిరుపతి 7680030065 నెంబర్లను సంప్రదించాలని కోరారు.